చేర్యాల షాపింగ్ కాంప్లెక్స్‌కు మోక్షమెన్నడో?

- ప్రారంభోత్సవంపై రాజకీయ క్రీనీడ
- పనులు పూర్తయినా వెంటాడుతున్న నిర్లక్ష్యపు గ్రహణం!
- ఏడాదిన్నర క్రితమే ప్రారంభానికి సిద్ధం
- నెలల తరబడి వృథాగా దుకాణాలు

8

అవిశ్రాంత సేవకులు



జహీరాబాద్ గడ్డంగల్లీలో పేదలకు ఆహారం ప్యాకెట్లను అందజేస్తున్న సేవాసమితి సభ్యులు

- ఆరుపదుల వయస్సులో అభాగ్యుల ఆకలి తీరుస్తున్న స్నేహితులు
- జహీరాబాద్ అన్నదాన సేవా సమితిగా ఏర్పడి కార్యక్రమాలు
- 15 మందితో మొదలై.. నేడు 150 మందికి చేరిన సభ్యులు
- ఐదేళ్లుగా రోజుకు 80 మందికి రెండు పూటలా ఆహారం పంపిణీ
- అవసరమైతే వైద్య ఖర్చులూ భరిస్తున్న సభ్యులు

7

ఉద్యోగాలిస్తారా.. గద్దె దించమంటారా?



కాంగ్రెస్ బాకీ కార్డు ప్రదర్శిస్తున్న నిరుద్యోగులు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులకు ఇస్తామన్న ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తారా లేదా గద్దె దించుమంటారా అని బీఆర్ఎస్ నాయకుడు, నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ పాల సాయిరాం అన్నారు. శనివారం సిద్దిపేటలోని గ్రంథాలయం వద్ద కాంగ్రెస్ నిరుద్యోగుల బాకీ కార్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాల సాయిరాం మాట్లాడారు. ప్రభుత్వంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీని అశోక్‌నగర్ తీసుకొచ్చింది యువతను రెచ్చగొట్టే ప్రసంగాలకేనా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లకు నియామక పత్రాలు ఇచ్చి గొప్పలు చెప్పుకుంటుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ బాకీ ఉన్న హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

మొక్కజొన్న కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూస్తాం

- మార్క్‌ఫెడ్ ఎండీ వి.శ్రీనివాస్‌రెడ్డి



పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి

హుస్నాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న కొనుగోళ్లలో ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మార్క్‌ఫెడ్ ఎండీ వి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో మొక్కజొన్న కొనుగోళ్లను శనివారం ఆయన పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులతో మాట్లాడారు. తేమ శాతం వచ్చేలా చూసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మొక్కజొన్నల కొనుగోళ్లు ఎలా జరుగుతున్నాయి, రైతుల ఇబ్బందులు ఏమిటి అనేది తెలుసుకోవడానికి తాను వచ్చానన్నారు. ఆయన వెంట సింగిల్ విండో ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కంది తిరుపతిరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, వైస్ ఛైర్మన్ బంక చందు తదితరులున్నారు.

మిల్లర్ ట్యాగింగ్ పూర్తి చేయాలి

- కలెక్టర్ హైమావతి

సిద్దిపేట అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కొనుగోళ్లు పూర్తయిన ధాన్యానికి సంబంధించి మిల్లర్ ట్యాగింగ్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ హైమావతి అన్నారు. ఆమె శనివారం అర్బన్ మండలంలోని మిట్టపల్లి, నంగునూరు మండలం ఉండ్రాయి గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. మిట్టపల్లిలో ఇప్పటివరకు 3 లారీల్లో 1,106 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి, మిల్లులకు తరలించామని సెంటర్ సిబ్బంది కలెక్టర్‌కి తెలపారు. ట్యాగింగ్ పూర్తి చేసి రైతులు ఖాతాలో వెంటనే నగదు జమచేయాలని ఆదేశించారు. రైతులు తేమశాతం వచ్చేవరకు కేంద్రంలో ఆరబోసే వాళ్లు సాయంత్రం కుప్పలు చేసుకుని టార్పాలిన్ కవర్లు కప్పితే అకాల వర్షాలు వచ్చిన ధాన్యం తడవకుండా ఉంటుందని సూచించారు. తేమశాతం వచ్చేవరకు పోలాల వద్ద ఆరబోయడం మంచిదని తెలిపారు. ఈ రోజు 12 మంది రైతుల ధాన్యం తేమ వచ్చిందని తెలుసుకుని, సాయంత్రం వరకు ఆరబోస్తే శాతం తగ్గుతుందని కలెక్టర్ చెప్పారు. వరి క్లీనింగ్ చేశాక ఎక్కువ మంది లేబర్‌ని పెట్టుకుని గన్నీలలో నింపి రాత్రి వరకు లోడ్‌అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

మొంథా తుపాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలు రైతులను కుదేలు చేశాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట, చేతికొచ్చే సమయానికి తుపాన్ రూపంలో నోటికాడి ముద్దను లాగేసింది. మరో రెండు, మూడు రోజుల్లో కోయాలని భావించిన పంటలను ప్రకృతి విపత్తు గద్దలాగా తన్నుకుపోయింది.



సిద్దిపేట నర్సాపూర్‌లో నెలకొరిగిన వరి

2,515 ఎకరాల్లో పంట నష్టం

- మొంథా బీభత్సంతో రైతు కుదేలు
- దెబ్బతిన్న కోతకొచ్చిన వరి చేలు
- పత్తి పంటనూ ముంచిన వర్షం
- అన్నదాతల పెట్టుబడిపై పిడుగు
- ఎకరానికి రూ. 10 వేల పరిహారం
- పంపిణీపై రైతుల్లో అనుమానం

సిద్దిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా పోటెత్తిన వరద నీరు వేలాది ఎకరాల్లోని పంట పొలాలను ముంచెత్తింది. మార్కెట్ యార్డులు, ఐకేపీ కేంద్రాలకు తరలించిన ధాన్యం సైతం నీటిలో కొట్టుకుపోగా, తడిసిన ధాన్యం మొలకెత్తి తీవ్ర నష్టం వాటిల్లింది. వ్యవసాయం కోసం పెట్టిన పెట్టుబడి, కళ్ల ముందే వర్షార్పణం కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రతీ ఏటా ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నామమాత్రపు పరిహారం అందించి చేతులు దులుపుకుంటున్నాయనే ఆవేదన అన్నదాతల్లో వ్యక్తమవుతోంది.

ప్రాథమికంగా నష్టం అంచనా

మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలోని 10 మండలాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. కోహెడ, బెజ్జంకి, నంగునూరు, కొండాపూర్, అక్బర్‌పేట-భూంపల్లి, అక్కన్నపేట, జగదేవ్‌పూర్, చిన్నకోడూర్, నారాయణరావుపేట, సిద్దిపేట రూరల్ పరిధిలోని దాదాపు 70 గ్రామాల్లో పంట

మిగతా 8వ పేజీలో



హుస్నాబాద్ మండలం పందిళ్లలో మునిగిన పత్తి పంట

నష్టపోయిన రైతులు, వరి, పత్తి పంట వివరాలు (ఎకరాల్లో)

మండలం	గ్రామాలు	రైతులు	వరి	రైతులు	పత్తి
కోహెడ	19	460	693	114	162
బెజ్జంకి	07	108	108	70	70
నంగునూరు	20	448	706	0	0
చేర్యాల	1	10	15	10	15
అక్బర్‌పేట-భూంపల్లి	1	06	10	0	0
అక్కన్నపేట	14	282	476	36	54
జగదేవ్‌పూర్	1	12	25	0	0
చిన్నకోడూర్	2	38	82	0	0
నారాయణరావుపేట	2	37	51	0	0
సిద్దిపేట రూరల్	3	35	48	0	0
మొత్తం	70	1436	2214	230	301

నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల పరిహారం

- దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణకు చర్యలు
- హుస్నాబాద్‌లో డ్రైనేజీ నిర్మాణానికి రూ.80 కోట్లతో ప్రతిపాదనలు
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల పరిహారం అందిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన వరద బాధితులను ప్రతీ ఒక్కరిని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఎవరు అధైర్య పడవద్దని సూచించారు. ఇంతకు ముందెన్నడు లేని విధంగా జిల్లాలో కురిసిన వర్షానికి అపార నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. హుస్నాబాద్ మార్కెట్‌యార్డులో 90 మెట్రిక్ టన్నుల ధాన్యం పూర్తిగా కొట్టుకపోయిందని, వేలాది మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసి రైతులకు అపార నష్టం కలిగించిందని తెలిపారు. తాను స్వయంగా అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రభుత్వం తరఫున ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. వరదలతో మృత్యువాత పడిన ముగ్గురి కుటుంబాలను, చనిపోయిన పశువులకు చెందిన యజమానులను ఆదుకుంటామని మంత్రి తెలిపారు. దెబ్బతిన పంటలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా ఎకరానికి రూ.10 వేల నష్ట పరిహారం తప్పక అందిస్తామన్నారు. వాటితో పాటు వర్షాలతో దెబ్బతిన్న పీఆర్, ఆర్అండ్‌బీ రోడ్లు, కల్వర్టులను గుర్తించి వాటి పునరుద్ధరణకు చర్యలు చేపట్టామని చెప్పారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణానికి వరద నీటి ముంపు లేకుండా డ్రైనేజీ నిర్మాణం చేపట్టేందుకు రూ.80 కోట్లతో డీపీఆర్ రూపొందించామని వెల్లడించారు.

సిబ్బంది లేక మార్కెట్‌యార్డుల్లో ఇబ్బంది

- నలుగురి పనిభారం ఒక్కరిపైనే
- సీజన్‌లో రైతులకు తప్పని అవస్థలు
- ఒక్కో కార్యదర్శికి మూడేసి యార్డుల బాధ్యతలు



దుబ్బాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతలకు సేవలు అందించాల్సిన వ్యవసాయ మార్కెట్ యార్డులు ప్రస్తుతం తీవ్ర సిబ్బంది కొరతతో సతమతమవుతున్నాయి. కేవలం ఆదాయంపై దృష్టి పెడుతూ, సేవలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ప్రభుత్వ పథకాలు, సేవలు రైతులకు నామమాత్రంగానే అందుతున్నాయి.

ఇన్‌చార్జిలే దిక్కు

జిల్లాలోని మొత్తం 14 మార్కెట్ కమిటీల్లో పూర్తిస్థాయి కార్యదర్శులు లేక, అన్ని యార్డులు ఇన్‌చార్జిలతోనే కాలం వెల్లదీస్తున్నాయి. ఐదు మార్కెట్ యార్డులకు మాత్రమే పూర్తిస్థాయి కార్యదర్శులు ఉన్నారు. మిగతా కమిటీలకు అదే కార్యదర్శులు అదనపు బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తుంది. సిద్దిపేట మార్కెట్ యార్డు కార్యదర్శికి అదనంగా నంగునూరు, హుస్నాబాద్, బెజ్జంకి మార్కెట్‌యార్డుల బాధ్యతలు అప్పగించారు. ఆయన ఏకకాలంలో నాలుగు యార్డులను పర్యవేక్షించాల్సి వస్తుంది. వంటిమామిడి మార్కెట్ యార్డుకు రంగారెడ్డి జిల్లాలోని షాద్‌నగర్ కార్యదర్శికి అదనపు బాధ్యతలు అప్పగించారు. కూరగాయల అమ్మకానికి ప్రాధాన్యత కలిగిన ఈ యార్డులో రెండు పూటలా అమ్మకాలు జరుగుతాయి. వేరే జిల్లా కార్యదర్శి పర్యవేక్షణతో ఇక్కడ సమస్యలు తలెత్తుతున్నాయి.

ఔట్‌సోర్సింగ్‌పై ఆధారపడి

జిల్లాలో మొత్తం 47 మంది వివిధ కేటగిరీల్లో సిబ్బంది ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 14 మందితోనే మార్కెట్ యార్డులు నడుస్తున్నాయి. ఇంకా 33 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సగటున రూ.4.56 కోట్ల వార్షిక ఆదాయం ఉన్న హుస్నాబాద్ మార్కెట్ యార్డులో ఒకరు మాత్రమే ఉన్నారు. సిద్దిపేట కార్యదర్శే హుస్నాబాద్‌లో అదనపు బాధ్యతలను కొనసాగిస్తున్నారు. ఇక్కడి చెక్‌పోస్టుల ద్వారా రూ.41 లక్షల వరకు వచ్చే ఆదాయాన్ని కూడా ఔట్‌సోర్సింగ్ సిబ్బందే వసూలు చేస్తున్నారు. రూ.4.81 కోట్ల ఆదాయం ఉన్న చేర్యాల మార్కెట్ యార్డులో కార్యదర్శి ఉన్నప్పటికీ ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో పని చేయిస్తున్నారు. సుమారు రూ.4.81 కోట్ల ఆదాయం వచ్చే గజ్వేల్ మార్కెట్ పరిధిలో ఆరు జిన్నింగ్ మిల్లులు ఉండగా సిబ్బంది కొరత తప్పడం లేదు. సిద్దిపేట మార్కెట్ యార్డుకు దాదాపు రూ.3.61 కోట్ల ఆదాయం వస్తుండగా ప్రధాన యార్డు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, పశువుల అంగడిని కేవలం ఇద్దరు మాత్రమే చూస్తున్నారు. సుమారు రూ.2 కోట్ల వార్షిక ఆదాయం ఉండే దుబ్బాక మార్కెట్‌యార్డులో ఒక కార్యదర్శి, ఒక ఏఎంఎస్ ఉన్నారు. కోహెడ, కొండపాక మార్కెట్ యార్డుల్లో రెగ్యులర్ సిబ్బంది లేకపోవడంతో, సెక్యూరిటీ గార్డులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందితోనే పనులు సాగిస్తున్నారు.

సీజన్‌లో రైతులకు తప్పని కష్టాలు

ప్రస్తుతం పత్తి, వరి ధాన్యం కొనుగోళ్ల సీజన్ కావడంతో కేంద్రాలకు వసతులు కల్పించాల్సిన సిబ్బంది లేకపోవడంతో సమస్యలు తప్పడం లేదు. అదనపు పనిభారంతో సిబ్బంది సరైన పర్యవేక్షణ చేయలేకపోతున్నారు. టార్పాలిన్ కాగితాలు సకాలంలో అందించడం, ధాన్యం, పత్తి కొనుగోళ్లను పర్యవేక్షించడంలో జాప్యం జరుగుతుండటంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

డీఎంవోపై ఐదు యార్డుల భారం

జిల్లా మార్కెట్ అధికారి (డీఎంవో) పరిస్థితి మరింత దారుణం. సిద్దిపేట జిల్లా డీఎంవోకు మెదక్ జిల్లా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీనికి తోడు, జిల్లాలోని చిన్నకోడూరు, కొండపాక, కోహెడ మార్కెట్ కమిటీల కార్యదర్శి బాధ్యతలను కూడా ఆయనే నిర్వర్తిస్తున్నారు. రెండు జిల్లాలను పర్యవేక్షించడంతో పాటు, ఐదు మార్కెట్ యార్డుల కార్యదర్శి పనులను కూడా చూడాల్సి వస్తుంది. డీఎంవో కార్యాలయంలో కూడా ఐదు పోస్టులకు గాను ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఈ పనిభారంతో కార్యకలాపాల పర్యవేక్షణలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



శ్మశానవాటికలో చితాభస్మం మాయం

- కాష్టం బయట సగం కాలిన స్థితిలో మరో శవం
- క్షుద్ర పూజల కోసమా ? లేక బంగారం కోసమా...?
- చేగుంట వైకుంఠధామంలో ఘటన

7

పిచ్చికుక్కదాడిలో ఎనిమిది మందికి గాయాలు

7

అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో

రేషన్ బియ్యంతో ఉచిత బ్యాగుల పంపిణీ

- ఈ నెల నుంచే ప్రారంభం

మద్దూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌షాపుల్లో సరఫరా చేస్తున్న సన్నబియ్యంతో పాటు, ఈ నెల నుంచి ఉచితంగా బ్యాగులను అందిస్తోంది. రేషన్ బియ్యం తీసుకోవడానికి వచ్చే లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ బ్యాగులను సరఫరా చేస్తున్నారు.

కొత్త నిబంధన..

ప్రభుత్వం అందిస్తున్న ఈ ఉచిత బ్యాగులపై 6 గ్యారంటీలు అభయహస్తం లోగోతో పాటు, సన్న బియ్యం ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం అనే నినాదాన్ని ముద్రించారు. అయితే, ఈ బ్యాగుల పంపిణీ విషయంలో లబ్ధిదారులకు కొత్త షరతులు ఎదురవుతున్నాయి. గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు లబ్ధిదారులు రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా(పోర్టబిలిటీ) రేషన్ బియ్యం తీసుకునే అవకాశం ఉండేది. కానీ, ప్రస్తుతం ఒక్కో షాపులో ఎంత మంది కార్డు హోల్డర్లు ఉన్నారో, సరిగ్గా అంతే మందికి లెక్క ప్రకారం ఉచిత బ్యాగులను సరఫరా చేస్తున్నారు. దీనివల్ల ఉచిత బ్యాగులు పొందాలనుకునే కార్డుదారులు తమకు కేటాయించిన రేషన్ షాపు వద్దకే వెళ్లి బియ్యంతో పాటు బ్యాగులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ ఎవరైనా పోర్టబిలిటీ విధానంలో వేరే షాపులో బియ్యం తీసుకుంటే, వారికి ఉచిత బ్యాగులు అందే అవకాశం ఉండదని తెలిసింది. ఈ విషయంపై మద్దూరు మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు కరీమద్దీన్ మాట్లాడుతూ, తన షాపులో 501 మంది కార్డు హోల్డర్లు ఉన్నారని, సరిగ్గా అంతే సంఖ్యలో ఉచిత బ్యాగులు వచ్చాయని తెలిపారు. లబ్ధిదారులు ఎక్కడ బియ్యం తీసుకున్నా, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ బ్యాగులను మాత్రం అందరికీ అందించాలని కార్డు హోల్డర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.



రేషన్‌షాపులో కార్డుదారుడికి అందజేస్తున్న బ్యాగు

పారిశుధ్య నిర్వహణకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కంది, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ కరువైం దని శనివారం ఆంధ్రజ్యోతిలో అటకెక్కిన చెత్త సేకరణ శీర్షికన ప్రచురిత మైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఎంపీవో (మండల పంచాయతీ అధికారి) మహేందర్ రెడ్డి వెంటనే గ్రామాలను శుభ్రపరచాలని, రోడ్లపై చెత్తా చెదారం లేకుండా చూడాలని మండలం లోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ మేరకు కవలంపేట, చేర్యాల, కాశీపూర్, చిమ్నాపూర్ తదితర గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టారు. జేసీబీల, పంచాయతీ సిబ్బందితో రోడ్ల పక్కన ఉన్న చెత్తను తొలగించారు. మురుగు కాలువలపై బ్లీచింగ్ పౌడర్ చల్లారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని ఎంపీవో మహేందర్ రెడ్డి కార్యదర్శులను హెచ్చరించారు.

సోలార్ ప్లాంట్‌లో కాపర్ వైర్ చోరీ


జేఎన్టీయూలోని సోలార్ ప్లాంట్

- రూ.కోటి విలువ గల సొత్తు అపహరణ
- సంఘటనా స్థలాన్ని సందర్శించిన డీఎస్పీ

పుల్‌కల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చౌట కూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజ నీరింగ్ కళాశాల సోలార్ ప్లాంట్‌లో చోరీ జరి గింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరా లిలా ఉన్నాయి. కళాశాల ఆవరణ ఉత్తర భాగంలో గంటకు నాలుగు మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ప్లాంట్‌ను నిర్మించారు. సుమారు 24 ఎకరాల్లో విస్తరించి ఉన్న సోలార్ ప్లాంట్‌లో 1,2,3 యూని ట్లను ఏర్పాటు చేశారు. అయితే, యూనిట్ 1లో మూడు నెలలుగా సోలార్ విద్యుత్ ఉత్పాదన నిలిచిపోయింది. యూనిట్ 1 మరమ్మతు చేయాల్సి ఉండటంతో శనివారం అటు వైపు వెళ్లిన సిబ్బంది పరిశీలిం చగా, కేబుల్ దొంగతనం జరిగినట్లుగా గమనిం చారు. మరమ్మతులో భాగంగా సోలార్ ప్లాంట్ పలకల కింద భూమిలో అమర్చిన కాపర్ కేబు ల్‌ను బయటకు తీశారు. ఈ కాపర్ కేబుల్‌ను ఎక్కడికక్కడ దొంగలు కత్తిరించుకుని ఎత్తుకు పోయారు. తెలిసిన వ్యక్తులే కాపర్ కేబుల్‌ను దొంగతనం చేసి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చోరీకి గురైన కాపర్ కేబుల్ సొత్తు విలువ రూ.కోటి వరకు ఉంటుందని జేఎ న్టీయూ అధికారులు పేర్కొంటున్నారు. సంఘ టన విషయమై కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథ రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, జోగిపేట సీఐ రవికు మార్, పుల్కల్ ఎస్సై ఎన్.విశ్వజన్‌లు సంఘ టనా స్థలాన్ని సందర్శించారు. సోలార్ ప్లాంట్‌లో పనిచేస్తున్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసు కున్నారు. కాపర్ కేబుల్ దొంగలను పట్టుకుం టామని డీఎస్పీ సత్తయ్యగౌడ్ తెలిపారు.

ఫాంహౌజ్‌లో మహిళ దారుణ హత్య

తాగిన మైకంలో భార్యను కడతేర్చిన భర్త

అమీన్‌పూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వివాహం జరిగి 20ఏళ్లైనా ఆ అభాగ్యురాలికి భర్త వేధింపులు తప్పలేదు. కాలేజీకి వెళ్లే ఇద్దరు పిల్లలున్నా వారి దాంపత్యంలో అనురాగం అన్నమాటే లేదు. కలహాల కాపురం నెట్టుకు వస్తున్న ఆ ఇల్లాలు చివరకు భర్త చేతిలోనే ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిన విషాద సంఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని వడక్‌పల్లి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా ఇందల్ వాయి మండలం త్రయంబకోపేట గ్రామపరిధిలోని గండితండాకు చెందిన బోనోత్‌రాజు (44) భార్య బానోత్‌సరోజ (35)లు అమీన్‌పూర్ మండలం వడక్‌పల్లి గ్రామ శివారులోని ప్రసాద్ అనే వ్యక్తి పొలంలో పనిచేస్తున్నారు. శుక్రవారం అర్ధారాత్రి భార్యాభర్తల మధ్య తగాదా ఏర్పడి వాదులాడుకు న్నారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న బానోత్‌రాజు దుడ్డుకర్రతో సరోజని విచక్షణా రహితంగా కొట్టాడు. తీవ్ర గాయాలతో అక్కడిక్కడే సరోజ మృతి చెందింది. పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

గతంలోనూ భార్యపై హత్యాయత్నం

నిందితుడు రాజు గతంలోనే సరోజపై దాడి చేసి తీవ్రంగా గాయపరి చాడు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా డిచ్ పల్లి పోలీసు స్టేషన్‌లో 2023లో హత్యా యత్నం కేసు నమోదు అయింది. నిందితుడు రాజు 40రోజుల పాటు జైలుకు వెళ్లి వచ్చాడు. తాను మారిపోయానని నమ్మించాడు. రాజు మాటలు నమ్మి కలిసి ఉండేందుకు సరోజ అంగీకరించింది. ఉపాధి కోసం ఆరు రోజుల క్రితం వడక్‌పల్లి గ్రామ శివారులో ప్రసాద్ అనే వ్యక్తి ఫాంహౌజ్‌లో కూలీలుగా చేరారు. అక్కడే తోటలో మకాం పెట్టారు. అర్ధరాతి మద్యం మత్తులో భార్యను దూషిస్తూ దారు ణంగా దాడి చేసి హత్య చేశాడు. నిందితుడు రాజుకు డిచ్‌పల్లి మండలం బీబీపూర్ గ్రామానికి చెందిన సరోజతో 2005లో వివాహం జరగగా కుమార్తె వినోద (18), కొడుకు విశాల్ (16) పిల్లలు ఉన్నారు. భర్తచేతిలోనే ప్రాణాలు కోల్పోయింది. మృతురాలి తల్లి బడావత్ చంగీబాయ్ ఫిర్యాదు మేరకు నిందితుడు రాజుపై హత్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, అతడిని త్వరలోనే పట్టుకుంటామని ఇన్ స్పెక్టర్ నరేష్ తెలిపారు.


సరోజ (ఫైల్)

సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేక నిఘా

- జిల్లా ఎస్పీ పంకజ్ పారితోష్

రాయికోడ్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కర్ణాటక, తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి ఎప్పుడూ పర్యవేక్షిస్తామని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పంకజ్ పారితోష్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి రికార్డులను, తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల నిఘాతో నేరాలు అదుపు చేయడం జరుగుతుందని, అందుకు ప్రతి ఒక్కరూ పోలీ సులకు సహకరించాలని ఆయన సూచించారు.

ఫోన్ల రికవరీలో పాపన్నపేట టాప్

- పోలీస్ స్టేషన్ పరిధిలో 381 సెల్ ఫోన్ల రికవరీ


రికవరీ అయిన ఫోన్లను చూపుతున్న బాధితులు,అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐ

పాపన్నపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : చోరీకి గురైన సెల్ ఫోన్ల రిక వరీలో పాపన్నపేట ముందంజలో ఉందని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ పేర్కొన్నారు. రికవరీ అయిన ఫోన్లను అందజేయడానికి స్థానిక ఎస్సై శ్రీనివాస్ గౌడ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో బాధితులతో శని వారం ఏర్పాటు చేసిన సమావేశానికి అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐ లు హాజరై రికవరీ అయిన 30 ఫోన్‌లను బాధితులకు అందజేశారు. అనం తరం అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ.. చోరీకి గురైన, ఎక్కడైనా ఫోన్ పోగొట్టుకున్న వెంటనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచిం చారు. ఇప్పటివరకు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పాపన్నపేటలో 381 ఫోన్లు రికవరీ అయ్యాయన్నారు. రెండు సంవత్సరాల క్రితం వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ సాధ్యపడుతుందన్నారు.

అప్పుల బాధలు.. ఆత్మహత్య

- వేర్వేరు చోట్ల ముగ్గురు ..

నర్సాపూర్/తొగుట/ములుగు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. గడ్డి మందు తాగి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన ములుగులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లెంకల ప్రశాంత్‌కుమార్(23) గత నెల 14వ వ్యవసాయ పొలం వద్ద గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్నాహ్నం మృతి చెందాడు. ప్రశాంత్ గత సంవత్సరం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతడికి భార్య, ఓ కుమారుడు ఉన్నాడు. తండ్రి సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విజయ్‌కు మార్ తెలిపారు.


ప్రశాంత్ కుమార్ (ఫైల్)

ఉరేసుకుని పాల వ్యాపారి ..


రామ్(ఫైల్)

పాల వ్యాపారం చేస్తు జీవనం సాగించే ఓ యువకుడు అప్పులు పెరిగిపోవడంతో వాటిని తీర్చే దారిలేక ఇంట్లోనే ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రంజిత్ కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నర్సా పూర్‌లో నివసించే బాలేష్ పెద్దకుమారుడు రామ్(26)పాలవ్యాపారం చేసి జీవనం సాగి ంచేవాడు. వ్యాపారం కోసం చేసిన అప్పులు పెరగడం వాటిని తీర్చే దారిలేక మనస్తాపంతో కొన్ని రోజులుగా బాధపడుతూ ఉండేవాడు. శనివారం ఉదయం ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. ఆసుపత్రికి తరలించగా అక్కడ డాక్టర్ పరిశీలించి మరణించిన్నట్లు ధృవీకరించడంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి..

అప్పుల బాధతో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తొగుట మండలం రాంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. తొగుట పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తోయేటి వెంకటేశ్ (29)కు అదే గ్రామానికి చెందిన అనూషతో 8 ఏళ్ల క్రితం వివాహం జరి గింది. అతడికి ముగ్గురు పిల్లలు శివ స్నేహిత్(5), నిత్యశ్రీ (3), చైత్రిక (13 నెలలు) ఉన్నారు. శివస్నేహిత్‌కు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఇటీ వల చనిపోయాడు. అతడి వైద్యానికి ఆరు లక్షల వరకు అప్పులయ్యాయి. దాంతో పాటు చిన్న కూతురు చైత్రిక ఆరోగ్యం కూడ బాగాలేకపోవడంతో ఎన్ని ఆస్పత్రులలో చూపించినా నయం కాలేదు.

తను చస్తేనే బాధలు పోతాయని వెంకటేశ్ ప్రతిసారి చెప్తూ బాధపడు తుండేవాడు. ఈనెల 30న రాత్రి వాగుగడ్డ సమీపంలో గుర్తుతెలియని పురుగుల మందు తాగానని కుటుంబ సభ్యులకు చెప్పి అపస్మారక స్థితిలో పడిపోయాడు. వెంటనే అతడిని కుటుంబీకులు 108 అంబులెన్స్ లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అత డిని గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కుటుంబీకులు అతడిని మెరుగైన వైద్యం కోసం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలంలోని అశ్విని ఆసుపత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతుండగా అతడికి ఆరోగ్యం క్షీణించందని వైద్యులు చెప్పారు. అతడిని శనివారం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోద్ చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తొగుట ఎస్సై రవి కాంత్‌రావు తెలిపారు.

అవిశ్రాంత సేవకులు

వారందరిదీ విశ్రాంత వయస్సే. అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని వారి నమ్మకం.. ఆలయాలు, బస్టాండ్లు, ఫుట్‌పాత్‌లపై ఉండే అభాగ్యులైన తమ వయస్సులో ఉన్నవారు పస్తులుండకూడదని తలచారు. అనుకున్నదే తడువుగా కొందరు స్నేహితులు ఒకటై అలాంటివారిని గుర్తించి నిత్యం రెండు పూటల భోజనం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. రెస్ట్ తీసుకునే వయస్సులో రిస్క్ తీసుకుంటూ ఐదేళ్లుగా రోజూ నిరుపేదల ఆకలి తీర్చుతున్న వారి సేవా కార్యక్రమాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

- అరుపదుల వయస్సులో అభ్యాగ్యుల ఆకలి తీరుస్తున్న స్నేహితులు
- జహీరాబాద్ అన్నదాన సేవా సమితిగా ఏర్పడి కార్యక్రమాలు
- 15 మందితో మొదలై.. నేడు 150 మందికి చేరిన సభ్యులు
- ఐదేళ్లుగా రోజుకు 80 మందికి రెండు పూటలా ఆహారం పంపిణీ
- అవసరమైతే వైద్య ఖర్చులనూ భరిస్తున్న సమితి సభ్యులు



మాణిక్‌ప్రభుమహేళలాలో అభాగ్యులకు ఆహార ప్యాకెట్లు తదితరాలను అందజేస్తున్న సేవాసమితి సభ్యులు

జహీరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్‌కు చెందిన పాండయ్య, బాల్‌రాజ్, వెంకటేశం, రాజయ్య, బాలకిషన్, నారాయణరెడ్డి, రామ్‌రతన్ తదితరులు చిన్ననాటి స్నేహితులు. గత ఐదేళ్ల క్రితం ఒకచోట కూర్చుని మాట్లాడుకుంటున్న సమయంలో సహాయ కార్యక్రమాలు చేపట్టాలనే ఆలోచన వారికి కలిగింది. ఆ తర్వాత కరోనా సమయంలో రోడ్లపై ఆకలితో అలమటిస్తున్న వారిని చూసి చలించిపోయారు. వెంటనే అందరూ కలిసి అన్నదాన సేవా సమితిని ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అన్నదానం చేస్తూనే ఉన్నారు. సుమారు 15 మందితో ప్రారంభమైన ఈ సమితిలో ప్రస్తుతం 150 మంది సభ్యులుగా చేరి, తమకు తోచిన స్థాయిలో ప్రతినెలా విరాళాలు సేకరిస్తూ సేవా కార్యక్రమాన్ని మరింత విస్తరించారు. పండుగల సమయంలో ఇళ్లల్లో ఏది వండినా వారికోసం తెచ్చిపెట్టడం, కొత్త దుస్తులు కొనివ్వడం, ఆరోగ్యాల విషయంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం వంటివి చేస్తున్నామని సేవా సమితి సభ్యులు వివరించారు.


పట్టణంలోని గడ్డంగల్లీలో పలువురు నిరుపేదలకు ఆహార ప్యాకెట్లను అందజేస్తున్న దృశ్యం

నిరుపేదలే లక్ష్యంగా

జహీరాబాద్ పట్టణంలోని నిరుపేదలే లక్ష్యంగా చేసుకుని, ప్రతిరోజూ రెండు పూటలా అన్నదానం చేయడం వీరు అలవాటుగా మార్చుకున్నారు. అన్ని దానాల్లోకెల్లా అన్నదానమే గొప్పది అనే సూక్తిని పాటిస్తూ, గత ఐదేళ్లుగా ప్రతిరోజు 80 మందికి పైగా అభాగ్యులకు, నిరుపేదలకు ఆహారం అందిస్తున్నారు. ఒకరోజు వారికి ఆహారం ఇవ్వకపోతే ఏదో కోల్పోయామనే భావన కలుగుతుందని, వారికి అన్నం పెట్టిన తర్వాతే తాము ఇళ్లకు వెళ్లి భోజనం చేస్తామని సేవా సమితి సభ్యులు వివరించారు. ఈ వయస్సులో రిస్క్ విషయాన్ని పక్కనబెట్టి, సేవ చేస్తే పుణ్యం వస్తుందనే ఉద్దేశంతోనే అన్నదానం చేయాలని సంకల్పించుకున్నామని సభ్యులు తెలిపారు.జహీరాబాద్ పట్టణంలో 8 ప్రాంతాలను గుర్తించి, అక్కడ అభాగ్యులైన నిరుపేదలకు ఆహారం పంపిణీ చేస్తున్నారు. శ్రీరాంమహేళాలో 8మంది, మాణిక్‌ప్రభు మహేళాలో 18, గడ్డంగల్లీలో 15, శాంతినగర్‌లో 18, వసుందరానగర్‌లో 4, బస్టాండ్ వద్ద 10, భవాని మందిర్ వద్ద 8, సిద్దేశ్వరాలయం వద్ద 5 మంది నిరుపేదలను గుర్తించి నిత్యం అన్నదానం చేస్తున్నారు. రోజుకు రెండు పూటలా సరిపడా ఆహారాన్ని హోటళ్లలో కొనుగోలు చేసి వారి వద్దకు వెళ్లి పంపిణీ చేస్తున్నారు. ఇంకా ఎవరైనా ఉంటే వారికీ ఆహారం అందిస్తున్నారు.

విరాళాలు సేకరిస్తూ..

ఖర్చుతో కూడుకున్న పని కాబట్టి కొందరిని సేవా సమితిలో సభ్యులుగా చేర్చుకుని, వారి నుంచి విరాళాలు సేకరిస్తూ ప్రస్తుతం అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామని సభ్యులు స్పష్టం చేశారు. తమకు ఎవరైనా సహకరిస్తే, రెట్టింపు నిరుపేదలను గుర్తించి అన్నదానం చేయడానికి సిద్ధంగా ఉన్నామని పలువురు సభ్యులు పేర్కొన్నారు.

సేవలోనే తృప్తి ఉంటుంది..



నాకు సుమారు 70 సంవత్సరాలు. నాకేందుకులే అనే విషయాన్ని పక్కనబెట్టి, నాతో సమాన వయసు కలిగిన నిరుపేదలను గుర్తించాం. మా ఆరోగ్యాలు మాకే సహకరించని పరిస్థితులు ఉన్నప్పటికీ అందరం ఏకమై నిరుపేదలకు ఆహార ప్యాకెట్లను ఇస్తున్నాం. మానవ జన్మ మళ్లీ రాదు కాబట్టి, ఇలాంటి సేవ చేస్తే పుణ్యం లభిస్తుందని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

- వెంకటేశం, వ్యాపారవేత్త, జహీరాబాద్

ఒక్కొక్కరిదీ ఒక్కో బాధ..



అభాగ్యుల్లో ఒక్కొక్కరి బాధలు వింటే ఒక్కో రకంగా ఉన్నాయి. వారి ఆవేదనను చూస్తే ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితి ఉంది. సుమారు 60 నుంచి 100 వయస్సున్న వారందరికీ అన్నం ప్యాకెట్లను ఇస్తున్నాం. ఒకరోజు ఇవ్వకపోతే వారంతా ఉపవాసం ఉంటారనే వేదన మమ్మల్ని కలిచివేస్తుంది. అందుకే ప్రతిరోజూ నిరుపేదలకు ఆహారాన్ని అందజేస్తున్నాం.

- పాండయ్య, విశ్రాంత ఉద్యోగి, జహీరాబాద్

వైద్యమూ చేయిస్తున్నాం..



తమకు ఆరోగ్యాలు సహకరించని పరిస్థితి అయినా, వాటన్నింటిని పక్కనబెట్టి నిరుపేదలకు ఆహారం అందజేస్తున్నాం. ఏమేము గుర్తించిన 80 మందిలో ఎవరికైనా అనారోగ్యం వస్తే, తమకు వచ్చిందనే భావనతో ఉంటాం. వెంటనే అవసరమైన వైద్యం చేయిస్తాం. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేసే భాగ్యం కొందరికే లభిస్తుంది.

-రాజయ్య, విశ్రాంత ఉద్యోగి, జహీరాబాద్

కాలుష్య కారక పరిశ్రమలపై ప్రజాగ్రహం

- ఫ్ల కార్డులతో భారీ ర్యాలీ
- పరిశ్రమల ముట్టడికి యత్నం.. అడ్డుకున్న పోలీసులు



గుమ్మడిదల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మండలం దోమడుగులోని నల్లకుంట చెరువు కాలుష్య జలాలతో నిండడంతో తీవ్రంగా నష్టపోతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రసాయన పరిశ్రమలను మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం దోమడుగు గ్రామ ఐక్యత కాలుష్య నిర్మూలన కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఫ్ల కార్డులు, పశువుల, దూడల తోలు బొమ్మలు, ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కొంతమంది నిరసనకారులు పరిశ్రమల ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నిరసనలో పాల్గొన్న రిటైర్డ్ సైంటిస్టు పర్యావరణ పరిరక్షకుడు బాబురావు మాట్లాడుతూ ఇది కేవలం నీటి సమస్య కాదు, జీవన సమస్య అన్నారు. కాలుష్య జలాలతో పంటలు ఎండిపోతున్నాయని, పశుపక్షాదులు చనిపోతున్నాయన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ గతంలో పలు సార్లు అధికారులు, కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా స్పందించాలని కోరారు. స్థానిక పర్యావరణ సంఘాలు, యువజన సంఘాలు ర్యాలీకి మద్దతుగా నిలిచాయి. సీఐ రమణారెడ్డి, ఎస్ఐ లక్ష్మీకాంత్ రెడ్డి పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో ఉద్రిక్తత

- మహేందర్‌ది ఆత్మహత్య కాదు.. హత్యే
- కుటుంబ సభ్యుల ఆరోపణ.. నిరసన
- కళాశాలలో పోలీసు బలగాల మోహరింపు


బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్

పుల్కల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కళాశాలలోని మానేర్ బ్లాక్ 304 గదిలో శుక్రవారం బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న బానోత్ మహేందర్(20) ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. కాగా, తమ కుమారుడిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదంటూ మృతుడి తల్లిదండ్రులు బానోత్ సుశీల, చిన్నేశ్వర్‌రావులు కన్నీటిపర్యంతమయ్యారు. తమకు న్యాయం చేసేంత వరకు కదిలేది లేదంటూ శనివారం ఉదయం సుల్తానపూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. అప్పటికే, కళాశాలలో పోలీసు బలగాలు మోహరించడంతో పరిస్థితులు అదుపులోకి వచ్చాయి. ఆత్మహత్య ఘటనపై ఏ రకమైన విచారణ కావాలంటే ఆ విధంగా చేపడతామంటూ సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ కుటుంబ సభ్యులతో మాట్లాడి నచ్చజెప్పారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులను కళాశాల నుంచి పంపించివేశారు. మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సమగ్ర దర్యాప్తుకు డిమాండ్..

కుటుంబ సభ్యులు, ఇతర బంధువులంతా మహేందర్ ఉంటున్న వసతి గృహం మానేర్ బ్లాక్ 304 గదిని పరిశీలించారు. మూడు టవల్స్‌ను ఒక చోట కట్టి గదిలోని ఫ్యానుకు ఉరి వేసుకుంటే ఫ్యాన్ రెక్కలు వంకరగా మారుతాయి కదా? అని ప్రశ్నించారు. లోపలి నుండి గది తలుపులకు గడియ బిగించుకుంటే బయట నుంచి తోస్తే తలుపులకు అమర్చిన గడియ ధ్వంసం కావాలి కదా? అంటూ నిలదీశారు. 70 కిలోల బరువు గల బీటెక్ విద్యార్థి మహేందర్ ఫ్యానుకు వేలాడితే ఫ్యాన్ వంగిపోయేదన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆత్మహత్యకు ముందు తన మొబైల్ ఫోన్ నుంచి హైదరాబాద్‌లో ఉన్న రాజు అనే వ్యక్తితో చివరగా మాట్లాడినట్లు గుర్తించారు. మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో కళాశాలకు సంబంధం లేని రాజు తమ కుమారుడిని హత్య చేసి ఉరి వేశారంటూ తల్లిదండ్రులు ఆరోపించారు. కాల్ లిస్ట్ ఆధారంగా సమగ్ర దర్యాప్తు చేయాలంటూ డిమాండ్ చేశారు.

గురుకుల పాఠశాలకు రూ.7.40 కోట్లు మంజూరు

- 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో స్పందించిన మంత్రి
- హర్షం వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మునిపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గురుకుల సొసైటీ హాస్టల్ భవనం సెప్టెంబర్ 9న కుప్పకూలిన విషయం తెలిసిందే. దీంతో విద్యార్థులకు కనీసం బస చేసేందుకు సౌకర్యం లేకుండా పోయింది. అదే రోజు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్ ప్రావీణ్య, డీఈవో వెంకటేశ్వర్లు, గురుకుల సొసైటీ అధికారులు సందర్శించి, విద్యార్థులకు వసతి విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అయినప్పటికీ, కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. దీంతో సెప్టెంబర్ 24న 'విద్యార్థుల వసతి ఎక్కడ..?' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన ఆ శాఖ అధికారులు సెప్టెంబర్ 25న తాత్కాలిక రేకుల షెడ్డు నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ, నెల రోజులు గడిచినా పనులు పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులు వసతి విషయంలో పడరాని పాట్లు పడుతుండడంతో, అక్టోబర్ 23న 'గురుకల చెదిరింది' శీర్షికన మరో కథనం ప్రచురితమైంది. ఈ వరుస కథనాలకు స్పందించిన మంత్రి రాజనర్సింహ, గురుకుల సొసైటీ పాఠశాల ఆధునిక డార్మిటరీ నిర్మాణం, విశాలమైన, సమగ్ర కిచెన్ కమ్ డైనింగ్ హాల్ నిర్మాణాలకు రూ.7.40 కోట్లు మంజూరు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహకు గురుకుల సొసైటీ అధ్యాపక బృందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు.


ABN ఆంధ్రజ్యోతి
విద్యార్థుల వసతి ఎక్కడ..?

శ్మశానవాటికలో చితాభస్మం మాయం

- కాష్టం బయట సగం కాలిన స్థితిలో మరో శవం
- క్షుద్ర పూజల కోసమా ? లేక బంగారం కోసమా...?

చేగుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలోని శ్మశాన వాటికలో శనివారం ఉదయం ఒక దారుణ సంఘటన వెలుగులోకి వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తులు రెండు వేర్వేరు దహన సంస్కారాలకు సంబంధించిన శవాల పట్ల దుశ్చర్యకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే, చేగుంట పట్టణానికి చెందిన మురాడి నరసమ్మ(105) గురువారం మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన ఏళ్ల కర్రె నాగమణి(70) శుక్రవారం మృతి చెందారు. వీరిద్దరికీ కుటుంబ సభ్యులు వైకుంఠధామంలో దహన సంస్కారాలు నిర్వహించారు. గురువారం దహనం చేసిన మురాడి నరసమ్మ శవం పూర్తిగా కాలిపోయినప్పటికీ, కాష్టం వద్ద తల భాగంలో ఉన్న చితాభస్మాన్ని దుండగులు పూర్తిగా ఊడ్చుకొని ఎత్తుకెళ్లారు. దీనికి పక్కనే శుక్రవారం దహనం చేసిన కర్రె నాగమణి సగం కాలిన శవం కాష్టం బయట పడి ఉంది. శనివారం ఉదయం కర్రె నాగమణి కుటుంబ సభ్యులు సంప్రదాయ పద్ధతిలో చాయ్ బిస్కెట్ పెట్టడానికి శ్మశాన వాటిక వద్దకు వెళ్లగా, సగం కాలిన శవం కాష్టం బయట కనిపించింది. దీంతో వారు దిగ్భ్రాంతికి గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిందూ సంప్రదాయం ప్రకారం, శవానికి ముక్కుపుడక లేదా కొంత బంగారాన్ని నోటిలో ఉంచి దహనం చేస్తారు. ఈ నేపథ్యంలో, దుండగులు బంగారం కోసమో లేక క్షుద్ర పూజల కోసమో ఈ దుశ్చర్యకు పాల్పడి ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డిని వివరణ కోరగా, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శ్మశాన వాటిక వద్దకు వెళ్లి చూడగా, కాష్టం బయట సగం కాలిన శవం పడి ఉన్న మాట వాస్తవమేనని ఆయన తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శ్మశాన వాటికలో కాష్టం వద్ద చితాభస్మం ఎత్తుకెళ్లిన దృశ్యం

మల్లన్న సేవలో మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి



మాజీ డీజీపీ దినేష్‌రెడ్డికి స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న అర్చకులు

కొమురవెల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించి స్వామివారి శేష వస్త్రాలను, చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు. దినేష్ రెడ్డి మాట్లాడుతూ... స్వామివారిని దర్శించుకోవడం ఇది నాలుగవసారి అనీ, దర్శించుకున్న ప్రతిసారి ప్రత్యేక అనుభూతి, ఆనందం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున, స్థానాచారి మల్లయ్య, స్థానిక ఎస్సై రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులుంటేనే ఒట్టు!

- ఖాళీ కుర్చీలతో బోసిపోతున్న ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయం
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు

అల్లాదుర్గం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చెరువులు, కుంటలకు గండ్లు పడి, నీటి ప్రవాహానికి ఆయకట్టు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే, దెబ్బతిన్న చెరువులు, కుంటలపై చర్యలు తీసుకోవలసిన అధికారుల జాడ కరువైందనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో అల్లాదుర్గంలోని నీటి పారుదల శాఖ సబ్ డివిజన్ కార్యాలయాన్ని 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా, కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ మినహా ఇతర అధికారుల కుర్చీలన్నీ ఖాళీగానే దర్శనమిచ్చాయి. రైతుల సంక్షేమం దృష్ట్యా అల్లాదుర్గం, టేక్మాల్ మండలాలను కలిపి అల్లాదుర్గంలో నీటి పారుదల శాఖ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ ఒక డీఈఈ, ఒక ఏఈఈతో పాటు ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక అటెండర్ పోస్టులను కేటాయించగా, అటెండర్ పోస్టు మినహా ఇతర పోస్టులన్నీ భర్తీ చేసింది. కానీ, ఈ కార్యాలయంలో కీలక అధికారులైన డీఈఈ, ఏఈలు కార్యాలయానికి వచ్చిన దాఖలాలు లేవని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. గత సెప్టెంబర్ 17న నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవాన్ని సైతం ఈ అధికారులు నిర్వహించకుండా కార్యాలయానికి దూరంగా ఉండటమే వీరి పనితీరుకు నిదర్శనం. ఈ కార్యాలయం మండల కేంద్రానికి సుమారు కిలోమీటరు దూరంలో ఉండటంతో అధికారులు తమ ఇష్టానుసారం విధులు నిర్వహిస్తున్నారని, జిల్లా అధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడం వీరికి వరంగా మారిందని ఆయా మండలాల రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారులు ఇకనైనా స్పందించి, అధికారులు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.


కార్యాలయంలో అధికారులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయానికి మైనార్టీ నేత విరాళం

ములుగు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయాల నిర్మాణానికి బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర యూత్ విభాగం ఉపాధ్యక్షుడు జుబేర్ రూ.లక్షా 11వేల విరాళాన్ని అందించారు. శనివారం మలుగులోని ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా జుబేర్ మాట్లాడుతూ కులాలకతీతంగా అందరికి ఆర్థిక సహాయం చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు తూర్పింటి లక్ష్మణ్, బుడిగె సంజీవులు, బుడిగె నాగరాజు, తోడేటి భిక్షపతి, తోడేటి నరేందర్ తదితరులున్నారు.


విరాళం అందించిన జుబేర్

పిచ్చికుక్క దాడిలో ఎనిమిది మందికి గాయాలు


కుక్క కాట్లు, చికిత్స పొందుతున్న బాధితులు

మిరుదొడ్డి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో ఎనిమిది మందికి గాయాలు అయ్యాయి. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో శనివారం జరిగిన ఈ ఘటన వివరాలు.. గ్రామంలోని శనివారం సాయంత్రం ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామానికి చెందిన గొల్ల నిఖిల్(3), మోటి మైసయ్య(70), శ్రేయాన్స్(4), బాలవ్వ(65), హరిక(18), మనోజ్, నిత్యశ్రీ, తదితరులు ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా, ఎక్కడి నుంచి వచ్చిందో ఓ పిచ్చికుక్క వచ్చి వారిపై దాడి చేసింది. ఎనిమిది మందిని కరవడంతో వారంతా గాయపడ్డారు. వారిని హుటాహుటిన దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామాల్లో కుక్కల బెడదను నివారించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ మండిపడ్డారు.

వీరభద్ర స్వామి ఆలయానికి కార్తీక శోభ

- వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు


సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

గుమ్మడిదల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్ర స్వామి ఆలయంలో శనివారం కార్తీక మాస పూజలతో భక్తుల రాకతో సందడి వాతావరణం నెలకొంది. వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణం దీపాలతో ప్రకాశవంతంగా అలంకరించబడింది. ఆలయంలో ప్రతిరోజూ సాయంత్రం దీపాలు వెలిగించడం, సత్యనారాయణ స్వామి వ్రతాలు, అభిషేకాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు హనుమకొండ జిల్లా అదనపు న్యాయమూర్తి అపర్ణ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి, కమిటీ కార్యవర్గ సభ్యులు భాస్కర్ గౌడ్, ఆలయ పర్యవేక్షకులు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

రూరల్ ఎంపీడీవోగా జయరామరాజుకు బాధ్యతలు



సిద్దిపేట రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట రూరల్ మండల ఎంపీడీవోగా జయరామరాజును నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు సిద్దిపేట రూరల్ ఎంపీడీవోగా పని చేసిన మాడ్గుల మురళీధర్‌శర్మ అక్టోబరు 31న ఉద్యోగ విరమణ పొందారు. మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న జయరామరాజుకు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



మల్లారెడ్డి పాఠశాల విద్యార్థులకు టై, బెల్టు, ఐడీ కార్డులు పంపిణీ చేసిన జైపాల్‌రెడ్డి

సిద్దిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య లభిస్తుందని మండల విద్యాధికారి ఉదయ్ భాస్కర్ పేర్కొన్నారు. శనివారం వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లిలో మాజీ ఉప సర్పంచ్ జైపాల్‌రెడ్డి సహకారంతో విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం జైపాల్‌రెడ్డిని పాఠశాల యాజమాన్యం, గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పంజాల వెంకటేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గారెడ్డి, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, సీఆర్పీలు యాదగిరి, ఏపీపీసీ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో నోట్ పుస్తకాల వితరణ

మర్కుక్, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గంగాపూర్ ఏడేళ్ల క్రితం మూత పడి ఎంఈవో వెంకటరాములు చొరవతో మళ్లీ ఈసారి పునః ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఎంఈవో వెంకట రాములు పిలుపునకు స్పందించిన ఎంతో మంది దాతలు ముందుకు వస్తున్నారు. తాజాగా శనివారం గ్రామ యువకులు రామసింగ్, దశరథ సింగ్‌లు విద్యార్థులకు సరిపడా నోటు పుస్తకాలను అందజేశారని ఎంఈవో తెలిపారు.

కస్తూర్బా పాఠశాలను సందర్శించిన ఎంఈవో

దౌల్తాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను శనివారం ఎంఈవో గజ్జల కనకరాజు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సమ్మెటీవ్, అసెస్మెంట్ పరీక్షల నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులకు తగు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి, కార్మికులకు పరిశుభ్రతపై తగు సూచనలు ఇచ్చారు.

లారీడ్రైవర్ కుటుంబానికి అండగా..



గజ్వేల్ రూరల్ నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజుల క్రితం గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కిషన్ ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు, డైమండ్ లారీ డ్రైవర్స్ యూనియన్ అసోసియేషన్ లారీ డ్రైవర్లు శనివారం కిషన్ కుటుంబ సభ్యులకు రూ.50,400 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో డైమండ్ లారీ డ్రైవర్స్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు నరేష్, బాలరాజు, ప్రభాకర్, సూరి, ఆసిఫ్, శంకర్, కిషన్, రజాక్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టవివరాలు సేకరించాలి

హుస్నాబాద్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ డివిజన్‌లో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్ట అంచనాలను నమోదు చేయాలని కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఎక్కడో ఉండి నష్ట పరిహార అంచనాలను తయారు చేయకుండా ప్రత్యక్షంగా ప్రతి రైతును కలసి న్యాయం జరిగేలా చూడాలన్నారు. దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ. 50 వేల వరకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

దౌల్తాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ హక్కుల సాధన కోసం నవంబరు 26న 'హలో మాల- ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తాలో ఛలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి కాల్వ నరేష్, జిల్లా నాయకులు మండల యాదగిరి, మాల మహానాడు మండల అధ్యక్షుడు రాజేష్ పాల్గొన్నారు.

చేర్యాల షాపింగ్ కాంప్లెక్స్‌కు మోక్షమెన్నడో?

- వ్యవసాయ మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంపై రాజకీయ క్రీనీడ
- పనులు పూర్తయినప్పటికీ వెంటాడుతున్న నిర్లక్ష్యపు గ్రహణం !
- ఏడాదిన్నర క్రితమే ప్రారంభానికి సిద్ధం
- రాజకీయ ప్రమేయంతో కొనసాగుతున్న 'వాయిదాల పర్వం'
- నెలల తరబడి వృథాగా దుకాణాలు



చేర్యాల వ్యవసాయమార్కెట్‌యార్డు షాపింగ్ కాంప్లెక్స్

చేర్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో ఏ-గ్రేడ్ విభాగానికి చెందిన చేర్యాల వ్యవసాయమార్కెట్ కమిటీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవానికి రాజకీయ క్రీనీడ దోబూచులాడుతుంది. సంబంధితశాఖాధికారుల పనితీరుకు, పాలకమండలి నిర్లక్ష్యవైఖరి తోడు కావడంతో ప్రారంభానికి నోచుకుంటుందా... లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మార్కెట్ తరుపున యేళ్లతరబడిగా ఎలాంటి కొనుగోళ్లు చేపట్టకపోయినా, రైతుహిత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టకపోయినా, కనీసం చిరువ్యాపారులు, రైతులకు ప్రయోజనం చేకూర్చే షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభానికి చర్యలు తీసుకోకపోవడంతో స్థానిక రైతులు ఉసూరుమంటున్నారు.

దాదాపు మూడేళ్ల క్రితం శంకుస్థాపన

మార్కెట్‌యార్డుకు శాశ్వత ఆదాయం సమకూర్చాలన్న సంకల్పంతో గత కమిటీ బీఆర్ఎస్ హయాంలో 20దుకాణాల నిర్మాణానికి సంకల్పించింది. మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి చొరవతో సుమారు రూ.1.50కోట్లు మంజూరయ్యాయి. తద్వారా 6 ఏప్రిల్ 2022న శంకుస్థాపన చేయడంతో పనులు ప్రారంభించారు.

ఏడాదిన్నర క్రితం పనులు పూర్తయినా..

సుమారు ఏడాదిన్నరక్రితం కాంప్లెక్స్ పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. కానీ అసెంబ్లీ ఎన్నికల అనంతరం నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు తలకిందుల వడంతో షాపింగ్ కాంప్లెక్స్‌కూ రాజకీయ గ్రహణం పట్టుకుంది. ఎన్నికల అనంతరం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు తేదీ ఖరారు చేసినప్పటికీ అధికారులు అర్థాంతరంగా నిలిపివేశారు. పట్టణం రోజురోజుకూ విస్తరించడం, మార్కెట్ యార్డుకు సమీపంలోనే తహసీల్, ఎంవీఐ, ఎంపీడీవో, ఐకేపీ కార్యాలయాలు, ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ భవనం ఉండటం, అంగడి బజారులోని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ కూల్చివేయడం, పట్టణంలో జాతీయ రహదారి విస్తరణ పనులతో పలువురు దుకాణాలు కోల్పోవడంతో పాటు మున్సిఫ్ కోర్టు ఏర్పాటు కావడం వలన చిరు వ్యాపారులు, కార్యాలయాల ఏర్పాటుచేసుకోవడం కోసం మార్కెట్ కమిటీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంపై ఆశలు పెట్టుకున్నారు. తద్వారా ఆయా దుకాణాలకు డిమాండ్ పెరిగినప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడంతో ఉసూరుమంటున్నారు.

పట్టించుకోని పాలకులు

కాంగ్రెస్ ప్రభుత్వం కొన్నాళ్లక్రితం పాలకమండలిని సైతం నియమించినా ప్రారంభానికి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో నెలలతరబడిగా దుకాణాలన్నీ అలంకారప్రాయంగా మారాయి. లక్షలాదిరూపాయలు వెచ్చించినా నిరుపయోగంగా మారి పట్టింపులేనితనాన్ని వెక్కిరిస్తున్నాయి. స్వతహాగా శాశ్వత ఆదాయం సమకూరడంతో పాటు ఆయా వర్గాలకు ఆసరాగా నిలవనున్న షాపింగ్ కాంప్లెక్స్ పట్ల ఎవరికి వారుగా వైరుధ్యాలతో వాయిదాలు వేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు, నేతలు కాస్త బెట్టువీడి త్వరితగతిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

మంత్రులు రావడమే తరువాయి..

షాపింగ్‌కాంప్లెక్స్ పనులు పూర్తయ్యాయి. విద్యుత్ మీటర్లు బిగింపు, ఇతరత్రా పనులు పూర్తి చేశాం. మంత్రులతో ప్రారంభింపచేయాలని కమిటీ వాళ్ల ప్రయత్నిస్తుండటంతో ఆలస్యమైంది. మంత్రుల తేదీ ఖరారైన వెంటనే ప్రారంభింపచేస్తాం.

- రవికుమార్, మార్కెట్ కార్యదర్శి

దుబ్బాక రహదారులకు 30.62కోట్ల నిధులు



పీఆర్, ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో సమీక్ష జరుపుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, నవంబరు1(ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజక వర్గంలోని వివిధ గ్రామాలకు రహదారుల మరమ్మతులకు సుమారు రూ.30.62కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్టు దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్ బీ అధికారులతో సమీక్ష జరిపారు. దుబ్బాక నియోజకవర్గంలోని 25 రోడ్ల మరమ్మతులకు సుమారు రూ.30.62 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. అంతేగాక మరో రూ.20 కోట్లకు ప్రతిపాదనలు పంపాలని, అంతేగాక దుబ్బాక- హబ్షీపూర్ గ్రామాల మధ్య ఫోర్‌లైన్ రహదారికి సుమారు రూ.40 కోట్ల ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. మరో రూ.67 కోట్లతో ఎనగుర్తి, శివాజీనగర్, ముందు చింత నుంచి బేగంపేట వరకు రహదారికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. రూ.10.40 కోట్లతో ఐదు బాక్స్ కల్వర్టుల నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు పంపినట్టు ఆయన తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్ అండ్‌బీ ఈఈ నాయుడు, డీఈ వెంకటేష్ , పంచాయతీ రాజ్ డీఈలు విజయ్ ప్రకాష్, సూర్య ప్రకాష్ ఉన్నారు.

పత్తి పంటను ధ్వంసం చేసిన దుండగులు



ధ్వంసమైన పత్తి పంట వద్ద విజయామహేందర్ దంపతులు

కుకునూరుపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని దుండగులు పత్తి పంటను ధ్వంసం చేసిన ఘటన మండలం రాయవరం గ్రామంలో శనివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన గుర్రం మహేందర్ విజయ దంపతులు పీటీ వెంకటాపూర్‌కి వెళ్లే దారిలో ఎకరం పొలంలో పత్తి పంటను సాగు చేశారు. శుక్రవారం చేనులో పనులను ముగించుకొని ఇంటికి వెళ్లి, శనివారం ఉదయం వచ్చి చూసేసరికి పత్తి పంట మొత్తం ధ్వంసమైంది. గుర్తు తెలియని దుండగులు ఎవరో రోటవేటర్ యంత్రం సహాయంతో రాత్రి పంటను ధ్వంసం చేశారని బాధిత దంపతులు కన్నీరు మున్నీరయ్యారు. గ్రామంలోని వారే ఎవరో గిట్టని వారు ఈ పని చేసి ఉంటారని గ్రామస్థులు ఆరోపించారు.

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చెల్లించాలి

సిద్దిపేట, నవంబరు1(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని సిద్దిపేట రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పొన్నమల్ల రాములు డిమాండ్ చేశారు. శనివారం మిరుదొడ్డిలో రిటైర్డ్ ఉద్యోగులతో కలిసి మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందిన వారి బకాయిలను చెల్లించి ఆదుకోవాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన



కోమటి చెరువును సందర్శించిన డిగ్రీ కళాశాల విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం క్షేత్ర పర్యటన చేశారు. వృక్షశాస్త్ర మొదటి సంవత్సరం విద్యార్థులు పాఠ్యాంశంలోని శైవలాల గుర్తింపు సేకరణలో భాగంగా కోమటి చెరువును సందర్శించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సంపత్ కుమార్‌రెడ్డి, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రాణి కొమ్మిడి, వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ శైలజ, స్రవంతి, డాక్టర్ మిరాజ్ ఫాతిమా, యువరాజు, డాక్టర్ శ్రీనివాస్ విద్యార్థులకు శైవలాల ప్రయోగశాల పరంగా గుర్తించే విధానాన్ని, ఆవశ్యకత పట్ల అవగాహన కల్పించారు.

సంధ్యను సన్మానించిన దళిత సంఘాల నేతలు



సంధ్యను సన్మానిస్తున్న దళిత సంఘాల నేతలు

జగదేవ్‌పూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన తప్పెట్ల సత్యానారాయణ లక్ష్మి దంపతుల పెద్ద కూతురు సంధ్య యూపీఎస్సీ ఆలిండియా స్థాయిలో 29వ ర్యాంకు సాధించి హైడ్రో జియాలజిస్ట్‌గా ఎంపికైంది. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి, మాల మహానాడు రాష్ట్ర నేతలు తుమ్మ శ్రీనివాస్, చిప్పల యాదగిరి శనివారం వట్టిపల్లి గ్రామానికి చేరుకొని సంధ్యను శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే గ్రామ సర్పంచ్ రజిత రాజిరెడ్డి, కొండపోచమ్మ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, స్థానిక నాయకులు, జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సంధ్యను శాలువాతో సత్కరించారు.

ఆత్మగౌరవ సభకు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

జగదేవ్‌పూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీజేఐ బీఆర్ గవాయిపై దాడికి పాల్పడ్డ వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, భారత రాజ్యాంగాన్ని కాపాడాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పోసాన్‌పల్లి రాజు ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమం, దళితుల ఆత్మగౌరవ ర్యాలీకి మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పోసాన్‌పల్లి సాయిలు, పోసాన్‌పల్లిస్వామి, గుంద్రు ఉప్పలయ్య, బాలయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతో మత్స్యకారుల ఉపాధికి మార్గం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గజ్వేల్ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మెదక్ పార్లమెంటు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయి. గజ్వేల్ పట్టణంలో కేంద్ర మత్స్య శాఖ ఆధ్వర్యంలో రూ. 5 కోట్ల వ్యయంతో సమీకృత వ్యాపార సముదాయం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను బీజేపీ నాయకులు స్వాగతించారు. ఈ విషయమై గజ్వేల్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మల్లన్న సాగర్ పరిధిలోని మత్స్యకారులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చి, నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మెదక్ ఎంపీ సేవలను పార్టీ నాయకులు కొనియాడారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, నియోజకవర్గ కో కన్వీనర్ ఎల్కేటీ సురేష్, ఎస్సీ మోర్చా జిల్లా నేత శివకుమార్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



తొగుట మార్కెట్ యార్డులో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఏడీఏ మల్లయ్య



సిద్దిపేట అర్బన్: వరి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తొగుట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి లబ్ధిపొందాలని దుబ్బాక డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు కె. మల్లయ్య సూచించారు. శనివారం తొగుట మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని, అదే విధంగా ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. క్రాప్ బుకింగ్‌లో ఏమైనా సమస్యలుంటే సంబంధిత వ్యవసాయ విస్తరణ, వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే సరిచేస్తారని సూచించారు. వాతావరణ వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని ధాన్యాన్ని వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఏఈవోలు రాజేశ్, సాయికుమార్, పీఏసీఎస్ సీఈవో గంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

సిద్దిపేట, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మిరుదొడ్డి ఎంపీడీవో గణేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మిరుదొడ్డి మండలం లింగుపల్లి, మల్లుపల్లి గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం లక్ష్మీనగర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. వెంట ఏపీఎం లక్ష్మీనర్సవ్వ, సిబ్బంది తదితరులున్నారు.

రైతులను ఆగం చేయొద్దు

సిద్దిపేట అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పంటను అమ్ముకోవడానికి వచ్చిన రైతులను ఆగం చేయొద్దని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని రైతులను ఇబ్బందులకు గురి చెయ్యొద్దన్నారు. రైతులపై ఎలాంటి ఆంక్షలు విధించకుండా ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అల్లం ఎల్లం, పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్, సీనియర్ నాయకులు భాస్కర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి, తడకపల్లి తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నేతలు కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.

పత్తి కొనుగోళ్లను ప్రారంభించాలి

గజ్వేల్ రూరల్ నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): గత నెల 21 సీసీఐ పత్తి కొనుగోళ్ల ప్రారంభం అని చెప్పిన అధికారులు నేటికీ అమలు కాకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పత్తి కొనుగోలును ప్రారంభించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు, శనివారం జాలిగామ వాసవి కాటన్‌మిల్‌ను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పొన్నాల కుమార్‌తో కలిసి సందర్శించారు, అధికారులు తక్షణమే స్పందించి కొనుగోళ్లను ప్రారంభించాలన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ.10 వేల జరిమానా



వాహనదారులకు డ్రంకన్ డ్రైవ్ టెస్టులు చేస్తున్న రూరల్ ఎస్ఐ రాజేష్

సిద్దిపేట రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ.10 వేల జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష విధించనున్నట్టు సిద్దిపేట రూరల్ ఎస్ఐ కె.రాజేష్ హెచ్చరించారు. శనివారం సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తాలో వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తులకు మొదటిసారి రూ.10 వేల జరిమానా, 3 నెలలపాటు లైసెన్ రద్దు లేదా, 6 నెలల జైలు శిక్ష విధిస్తారని, రెండోసారి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ.15 వేల జరిమానా, రెండేళ్ల జైలు శిక్షతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను శాశ్వతంగా రద్దు చేయనున్నట్టు తెలిపారు. ప్రతీ వాహనానికి సంబంధించిన పూర్తి డాక్యుమెంట్స్ కలిగి ఉండాలన్నారు. అక్రమంగా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు, ఇతర నిషేధిత రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

గజ్వేల్‌లో ఆరుగురికి రూ.60 వేలు..

గజ్వేల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌లోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం.మురళీ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో ఆరుగురు పట్టుబడగా, వారికి గజ్వేల్ కోర్టులో న్యాయాధికారి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ట్రాఫిక్ సీఐ ఎం.మురళి తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురిని శనివారం గజ్వేల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ ఎదుట కోర్టులో ప్రవేశపెట్టగా విచారణ అనంతరం నిందితులకు రూ.60 వేలు జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు.

చోరీకి యత్నించిన నిందితుడి అరెస్టు

కొమురవెల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరాయపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో గల రేణుక ఎల్లమ్మ గుడిలో శుక్రవారం హుండీ దొంగతనానికి యత్నించిన కొండపాక మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన కొండాపురం యాదగిరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచినట్టు ఎస్ఐ రాజుగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫ్లెక్సీ ప్రింటింగ్ ఓనర్స్, వర్కర్స్ నిబంధనలు పాటించాలి: ట్రాఫిక్ ఏసీపీ

సిద్దిపేట క్రైం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీ ప్రింటింగ్ ఓనర్స్ అండ్ వర్కర్స్ నిబంధనలు పాటిస్తూ వ్యాపారాలు చేసుకోవాలని ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఫ్లెక్సీ ప్రింటింగ్ ఓనర్స్ వర్కర్స్ సమావేశం ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నివారణ గురించి అవగాహన కల్పించారు. సిద్దిపేట మెయిన్ చౌరస్తాల వద్ద మెయిన్ రోడ్డుకు వచ్చి వచ్చి పోయే వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందికరంగా పెద్దపెద్ద ఫ్లెక్సీలు పెట్టవద్దని సూచించారు. వాటివల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. 10 ఫీట్లకు పైగా ఫ్లెక్సీలు పెట్టవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, పట్టణంలో ఉన్న వివిధ ఫ్లెక్సీ షాపుల యజమానులు, వర్కర్స్ ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

హరీశ్‌రావును పరామర్శించిన పాలకవర్గం సభ్యులు



హరీశ్‌రావు తండ్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిద్దిపేట మహిళా కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ మంజుల

సిద్దిపేట కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ చనిపోయిన సంగతి తెలిసిందే. దీంతో శనివారం సిద్దిపేట మున్సిపల్ పాలకవర్గం హరీశ్‌రావును పరామర్శించారు. హైదరాబాద్ కోకాపేటలోని క్రిన్స్ విల్లాస్‌లోని హరీశ్‌రావు నివాసానికి మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సుతో పాటుగా మహిళా కౌన్సిలర్లు వెళ్లి తన్నీరు సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హరీశ్ రావుని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో కౌన్సిలర్లు వంగ రేణుకా తిరుమల్‌రెడ్డి, వరాల కవితాసురేష్, బింగి బాల్‌లక్ష్మి రాజేశం, మాజీ కౌన్సిలర్ నాయకం పుష్పలతాలక్ష్మణ్, దాసరి భాగ్యలక్ష్మి శ్రీనివాస్ యాదవ్, అడ్డగట్ల కావేరి అంజి, ఫాతిమా బేగం వజీర్, బందారం శ్రీలత రాజు, తస్లీమ్ బేగం మొయిజ్, గుడాల సంధ్య శ్రీకాంత్, భూంపల్లి శ్రీలత శ్రీహరి, గోపాలపురం దీప్తి నాగరాజు, కాటం శోభరాణి రఘురామ్ తదితరులు ఉన్నారు.

ఉచితంగా బ్యాగుల పంపిణీ

సిద్దిపేట, నవంబరు1(ఆంధ్రజ్యోతి):తల్లితండ్రులు లేని విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు, పుస్తకాలను అందిస్తున్నట్టు చేతన గ్రామీణ వికాస్ సేవా అందే సభ్యుడు సంతోష్ పేర్కొన్నారు. శనివారం మిరుదొడ్డి మండలం అల్వాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సామాజిక సమరసత వేదిక, యూత్‌ఫర్ సేవా ఆధ్వర్యంలో తల్లిదండ్రులు లేని విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చేతన గ్రామీణ వికాస్ సేవా అందే సభ్యులు పోశయ్య, పరశురాములు, సాయి, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

2,515 ఎకరాల్లో పంట నష్టం

(5వ పేజీ తరువాయి)



సిద్దిపేట మార్కెట్ యార్డులో మొలకెత్తిన ధాన్యం

నష్టం సంభవించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టంపై ప్రాథమిక అంచనా వేశారు. 1666 మంది రైతులకు చెందిన 2515 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. దీనిలో వరి పంట 2214 ఎకరాలు కాగా, పత్తి 301 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. జిల్లాలో జరిగిన నష్టంపై ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికను పంపనున్నట్లు అధికారులు తెలిపారు.

33 శాతం పంట దెబ్బ తింటేనే..

సాధారణంగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం, పంట 33 శాతం దెబ్బతింటేనే నష్ట పరిహారం అందిస్తారు. వరద నీటిలో మునిగిన పొలాల్లో ధాన్యం రికవరీ అయితే, పరిహారం చెల్లించే అవకాశాలు తక్కువగా ఉంటాయి. పత్తి పంట విషయానికొస్తే, పత్తికాయలు నీటిలో మునగడం వల్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. నీరు ఇంకిన పొలాల్లో మరో 10 రోజుల్లో రీ సర్వే చేసి, ఎంత నష్టం జరిగిందో అధికారులు లెక్కించనున్నారు.

పరిహారం అందేనా..?

ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల మేర పంట నష్టపరిహారం అందించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నప్పటికీ, రైతులు మాత్రం ఆందోళనలో ఉన్నారు. పంట నష్టం జరిగితే గత ప్రభుత్వ హయాంలో ఎకరానికి రూ.10 వేల చొప్పున రైతు ఖాతాల్లో జమచేసింది. అయితే, ఈ ఏడాది మార్చిలో కురిసిన వడగండ్ల వానకు పంట నష్టపోయిన రైతులకు ఇంతవరకు ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. అలాగే, ఆగస్టు నెలలో భారీ వర్షాల వల్ల 4 వేల ఎకరాల మేర పంట నష్టం జరగగా, రీ సర్వే తర్వాత దానిని వెయ్యి ఎకరాలుగా తేల్చి నివేదిక పంపారు. నెలలు గడుస్తున్నా ఆ పరిహారం రైతుల ఖాతాల్లో జమ కాలేదు. ఈ నేపథ్యంలో మొంథా తుఫాన్ కారణంగా తాజాగా నష్టపోయిన 2,515 ఎకరాలకు కూడా పరిహారం సకాలంలో అందుతుందో లేదోనని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.